
# రాబడి



# ఇలా.. ప్లాన్ చేసుకోండి

## సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1

- **సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం**

**పదవీ విరమణ** పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2

- **పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం**

**తపాలా శాఖ** అందించే ఈ స్కీంలో పెట్టుబడులకుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3




- **ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్క్‌లకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4



- **సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్**

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.



5

- **నేషనల్ పెన్షన్ సిస్టమ్**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరఫు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6

- **సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం**



**60 ఏండ్లు,** ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.


7



- **ట్యాక్స్ ఫ్రీ బాండ్లు**

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరఫున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8




- **ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం**

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్‌ఎస్‌ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.




9

- **మ్యూచువల్ ఫండ్స్**

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్క్‌లకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10

- **పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

## ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.




- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

## లాభాల స్వీకరణకు అవకాశం!

**దేశీయ** స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.






సమావేశాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

## వార్షిక వైద్య సమావేశం

విద్యానగర్, సెప్టెంబర్ 1 : కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఐఎంఏ జిల్లా శాఖ అధ్వర్యంలో వార్షిక వైద్య సంబంధిత సమావేశం నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పొలాస రామ్ కిరణ్ తెలిపారు. ఇందులో హైదరాబాద్ జెనిసిస్ దవాఖాన డాక్టర్ నర్మద కటకం ఇన్‌ఫెర్టిలిటీ (సంతాన సాఫల్యత)పై శాస్త్రీయ మార్పుల గురించి వివరించారు. డాక్టర్ కవిత నల్లపరెడ్డి న్యూక్లియర్ మెడిసిన్‌కి సంబంధించిన ప్రగతి విషయాలను, డాక్టర్ రవీంద్రరెడ్డి వైద్య సంబంధిత పాత, కొత్త మార్పులు, వైద్య చట్టాల సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే పక్ష వాతం వైద్యంలో సమయానికి ఉన్న ప్రాధాన్యతను వెల్‌నెస్ దవాఖానకు చెందిన డాక్టర్ శైలేశ్, విటమిన్-డీ ప్రాధాన్యతపై డాక్టర్ రవీంద్ర పాటిల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవగా, ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ మల్లికార్జున, సీనియర్ వైద్యులు డాక్టర్ కే శ్యామ్‌సుందర్, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ హరికిషన్, డాక్టర్ రవీందర్‌రావు, డాక్టర్ కిషన్, డాక్టర్ రమ, డాక్టర్ మాధవి, డాక్టర్ నాయని, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సుధా, డాక్టర్ రాజ్‌కుమార్, 200 మంది వైద్యులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొంగులేటి

కరీంనగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలందించాలని రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే శాంతికుమారి, డీజీపీ జితేందర్‌తో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయని, మరింత వరద వస్తే తెగిపోయే ప్రమాదమున్నదని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపరిస్థితుల తీవ్రత దృష్ట్యా అన్ని స్థాయిల అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. సమీక్షలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్‌డీవో కే మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



తిమ్మాపూర్: ఎల్‌ఎండీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాంనగర్/ గంగాధర/ తిమ్మాపూర్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి మంత్రి కరీంనగర్‌లోని తన కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. వరదల్లో రోడ్లపై ద్విచక్రవాహనాలు కూడా వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాలర్లు చేపట్టడానికి వెళ్ళకూడదని సూచించారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో పాటు జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, దిగువ మానేరు జలాశయంలోకి వస్తున్న వరద నీటి వివరాలు తెలుసుకున్నారు. రాజన్న సిరిసిల్ల, హన్మకొండ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి ఆయా జిల్లాల్లోని వరద పరిస్థితులపై ఆరా తీశారు.

**ముంపు బాధితులను ఆదుకుంటాం : మంత్రి**

నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులను గుర్తించి ఆదుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆదివారం కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపెల్లి సత్యనారాయణతో కలిసి ఆయన రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణపూర్ గ్రామస్తులు తమ సమస్యను మంత్రికి విన్నవించారు. నారాయణపూర్, ఇస్తారిపల్లి, మంగపేట, చెర్లపల్లి(ఆర్) గ్రామాల ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ఆదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ అనుపమ, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఎల్ ఎండీని సందర్శించిన మంత్రి**

భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఇతర అధికారులతో కలిసి ఎల్‌ఎండీని ఆదివారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద, పరిస్థితులపై ఎస్‌ఈ రమేశ్, ఈఈ నాగభూషణంలతో చర్చించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం ప్రభావం అంతగా లేదని, అలాంటి పరిస్థితి వస్తే అధికారులు సమస్య రాకుండా చూస్తున్నారని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఎల్లంపల్లి నుంచి నీటి పంపింగ్ నడుస్తున్నదని, అక్కడి నుంచి మిడ్‌మానేరు, టరంగనాయకసాగర్, కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టులను నింపడంతోపాటు ఎల్‌ఎండీ కాకతీయ కాలువ ద్వారా కోదాడ వరకు నీళ్లు పంపిస్తామని చెప్పారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతాం




రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 1 : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ స్పష్టం చేశారు. నగరంలోని కోతిరాంపూర్‌లో గల యూనియన్ కార్యాలయంలో నాలుగు రోజు పాటు నిర్వహించనున్న సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. రూ.లక్ష కోట్ల విలువైన సంస్థలను తమ అనుకూల కంపెనీలకు అప్పనంగా విక్రయిస్తుందని మండిపడ్డారు. కార్మికుల హక్కులను హరించేలా నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. నాలుగు రోజుల శిక్షణ తరగతుల్లో సామాజిక, సాంస్కృతిక అంశాలపై చర్చ, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పన ఉంటుందన్నారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కోశాధికారి అజయ్‌బాబు, నాయకులు మోహన్, రాములు, సత్యనారాయణ, శ్యామలీల, అశోక్, ఎడ్ల రమేశ్, పున్నం రవి పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇండ్లే టార్గెట్

తుమ్మనపల్లిలో నాలుగిళ్లలో చోరీ

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 1 : తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసిన దుండగులు శనివారం రాత్రి హుజూరాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో నాలుగిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొక్కల అనిల్‌రెడ్డి హైదరాబాద్, మరొకరు యాళ్ల కృష్ణ కరీంనగర్‌లో ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన రాచర్ల నర్సయ్య గురువారం హైదరాబాద్‌లోని తన కొడుకు దగ్గరకు వెళ్లాడు. నాంపల్లి కొమురయ్య పది రోజుల క్రితం ఇంటి కి తాళం వేసి హైదరాబాద్‌లోని దవాఖానకు వెళ్లాడు. ఈ నలుగురి ఇండ్లకు తాళం వేసి ఉండగా, గుర్తు తెలియని దుండగులు వాటిని పగుల కొట్టి చోరీకి పాల్పడ్డారు. అదివారం ఉదయం వారి ఇండ్ల సమీపంలో ఉన్న బంధువులు చూసే సరికి తాళాలు పగులకొట్టి ఉండడంతో బాధితులకు ఫోన్ చేసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, రాచర్ల నర్సయ్య ఇంట్లో సుమారు తులం బంగారం, రూ.1500 నగదు, నాంపల్లి కొమురయ్య ఇంట్లో సుమారు 40 తులాల వెండి చోరీకి గురైంది. అనిల్‌రెడ్డి, కృష్ణ ఇంట్లో ఎలాంటి వస్తువులు, నగదు పోలేదు. కాగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇండ్లనే దుండగులు టార్గెట్ చేస్తుండగా, గత నెల 18న ఇదే గ్రామానికి చెందిన ఏనుగు సత్యనారాయణరెడ్డి ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ మరమ్మతులు

వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ముకరంపుర, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది ఏర్పడిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, సీఈలు, ఎస్ఈలు, డీఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా పరిస్థితిని సమీక్షించారు. ఎడతెరిపి లేని వర్షంతో సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఎస్‌ఈలను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరా కోసం తీవ్రంగా శ్రమిస్తున్న సిబ్బంది సేవలను ప్రశంసించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912, 1800 4250028కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

## పేలిన ఇన్సులేటర్

ముకరంపుర, సెప్టెంబర్ 1 : కరీంనగర్-జగిత్యాల రోడ్డులోని ఎస్సారార్ కాలేజీ సమీపంలో గల 33 కేవీ టవర్‌లైన్ ఇన్సులేటర్ ఆదివారం రాత్రి ఒక్కసారిగా పేలిపోయింది. ఈ లైన్ కరీంనగర్ నుంచి కొత్తపల్లికి అనుసంధానమై ఉన్నది. వర్షంతో ఇన్సులేటర్‌లో సమస్య తలెత్తినట్లు అధికారులు తెలిపారు. కొత్తపల్లితో పాటు సమీప గ్రామాలకు ఆదివారం రాత్రి విద్యుత్ సరఫరాలో కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందిన వెంటనే ఎస్‌ఈతో పాటు టౌన్ డీఈ, టౌన్, రూరల్ ఏడీఈలు, సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

## కండక్టర్ టిమ్ మిషన్ అపహరణ

పట్టుకొని పోలీసులకు అప్పగించిన సెక్యూరిటీ సిబ్బంది

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 1: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఓ కండక్టర్ టిమ్ మిషన్(టికెట్ ఇష్యూ మిషన్)ను దుండగుడు ఎత్తుకెళ్లగా, గమనించిన సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సెక్యూరిటీ ఏఎస్ఐ వివరాల ప్రకారం.. అదివారం కరీంనగర్ టూ డిపోకు చెందిన బస్సు గోదావరిఖని నుంచి కరీంనగర్ వస్తుండగా నగరంలోని కోర్టు చౌరస్తా వద్ద ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కాడు. బస్టాండ్ చేరుకున్న తర్వాత ప్రయాణికులందరూ దిగిపోయాక డ్రైవర్ గంగారాం, కండక్టర్ ఆమని కంట్రోలర్ వద్దకు వచ్చారు. ఇదే సమయంలో ప్రయాణికుడు మళ్లీ బస్సు ఎక్కి టిమ్ మిషన్, కండక్టర్ బ్యాగ్ తీసుకొని వెళ్తుండగా, గమనించిన డ్రైవర్, సెక్యూరిటీ సిబ్బందితో కలిసి హైదరాబాద్ ప్లాట్ ఫాం-14 వద్ద పట్టుకున్నారు. అతని బ్యాగ్ తనిఖీ చేయగా టిమ్ మిషన్, కండక్టర్ బ్యాగ్ దొరికాయి. అతని పేరు రమేశ్ అని, హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నట్లు సెక్యూరిటీ ఏఎస్ఐ లకుమతి తెలిపారు. దొంగను వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు.